క్లుప్తంగా

నేడు షిరిడీ సాయికి ప్రత్యేక పూజలు

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరంలోని టీటీడీ కల్యాణ మండపంలో గురువారం షిరిడీ సాయి నాథుని జన్మ నక్షత్రాన్ని పురస్కరించుకుని ప్రత్యేక నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గుణశేఖర్ తెలిపారు. ఇందులో భాగంగా ఉదయం 10 గంటలకు శ్రీ కంచి కామాక్షి ఏకాంబరేశ్వర స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తామన్నారు. గణపతిపూజ, వరుణ కుంభ పూజలు కంచి కామాక్షి అమ్మవారి ఆలయ ప్రధాన అర్చకుల చేతుల మీదుగా జరుగుతాయని చెప్పారు.

రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలి


మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న ఎంఈఓ హేమలత

తవణంపల్లె: పాఠశాల రికార్డులను సక్రమంగా నిర్వహించాలని ఎంఈఓ హేమలత ఉపాధ్యాయులను ఆదేశించారు. మండలంలోని కె.పట్నం ప్రాథమికోన్నత, మైనగుండ్లపల్లె, ముత్తరపల్లె ప్రాథమిక పాఠశాలలను బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలల్లోని రికార్డులను, విద్యార్థుల హాజరు రిజిస్టర్లను తనిఖీ చేశారు. అనంతరం మైనగుండ్లపల్లె ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు రుచికమైన భోజనం పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో సీఆర్పీ గోపి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు బోయకొండకు ధర్మ ప్రచార రథం రాక

చౌడేపల్లె: కాణిపాకంలో స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానానికి చెందిన ధర్మ ప్రచార రథం బోయకొండలో ఈనెల 28వ తేది గురువారం సాయంత్రం 6 నుంచి 29వ తేది ఉదయం 11.30 గంటల వరకు అందుబాటులో ఉంటుందని ఈఓ చంద్రమౌళి తెలిపారు. భక్తులు ప్రచార రథంలో ఉన్న స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు పొందాలని కోరారు.

పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

పుత్తూరు రూరల్: స్థానిక పిళ్లారిపట్టు పాలిటెక్నికల్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు జరుగుతున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ఎస్.వి.కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు 10వ తరగతి పాస్ అయి ఉండాలన్నారు. నాలుగు తరగతి నుంచి 10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్, టీసీ మార్కులిస్ట్, ఆధార్ కార్డు జిరాక్స్, రేషన్‌కార్డులతో హాజరు కావాలని కోరారు. రూ.6 వేల అడ్మిషన్ ఫీజు చెల్లించాలని వెల్లడించారు. వివరాలకు 80086 38821 నంబరులో సంప్రదించాలన్నారు.

పటిష్టంగా ఆరోగ్య సురక్ష


ఎంపీడీఓ కార్యాలయ రికార్డులను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి

కార్వేటినగరం: రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న సురక్ష, జగనన్నకు చెబుదాం, స్వచ్ఛతా హీ సేవా వంటి కార్యక్రమాలను పటిష్టంగా నిర్వహించాలని జెడ్పీ సీఈఓ పీ.ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన స్థానిక ఎంపీడీఓ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. అలాగే కార్యాలయానికి సంబంధించిన పలు రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మండలస్థాయి అధికారులతో జగనన్నకు చెబుదాం, జగనన్న ఆరోగ్య సురక్ష, స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం చేపడుతున్న పథకాలను ప్రజలకు చేరే విధంగా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అదేవిధంగా జెడ్పీ నిధులతో నూతనంగా నిర్మాణాలు చేపడుతున్న సమావేశ భవనాన్ని పరిశీలించి పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఎంపీడీఓ మోహన్‌మురళిని ఆదేశించారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

జోరు వర్షం.. కూలిన స్లాబులు

నగరి: మండల పరిధిలో కురుస్తున్న జోరువర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయం కావడంతో పాటు పాత భవనాలకు చెందిన స్లాబులు వర్షపు నీటితో తడిచి కూలి కింద పడుతున్నాయి. బుధవారం పట్టణ పరిధి భేరి వీధిలోని ఒక నివాసం ముందున్న స్లాబు, సత్రం దక్షిణపు వీధిలోని ఒక భవనానికి చెందిన స్లాబు అకస్మాత్తుగా కూలిపోయింది. ఆ సమయానికి కింద ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.


కురుస్తున్న వర్షం

పంట నమోదుతో తక్షణ పరిహారం

- ఈ-క్రాప్ నమోదుకు ఈ నెల 30 వరకు అవకాశం
- ఇప్పటివరకు 7 వేల ఎకరాల నమోదు


ఎం.పైపల్లెలో పంట నమోదు చేస్తున్న వ్యవసాయ సిబ్బంది

ఐరాల: రైతు సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నారు. పంట సాగులో ప్రతి దశలోనూ సహకారం అందిస్తూ రైతు పక్షపాతిగా పేరు పొందారు. దేశంలోనే ఆదర్శంగా సంక్షేమ పథకాలు అందిస్తూ వ్యవసాయం దండగ కాదు పండగ అని నిరూపిస్తున్నారు. సాగు ప్రయోజనాలు సక్రమంగా అందించేందుకు ప్రవేశపెట్టిన ఈ-క్రాప్ విధానం రైతులకు వెన్నుదన్నుగా నిలుస్తుంది. ఆయా గ్రామాల్లోని ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగుచేసిన వివిధ రకాల పంటలను రైతు భరోసా కేంద్రంలో నమోదు చేస్తున్నారు. ఈ-క్రాప్ నమోదుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. మండల పరిధిలో పంట పొలాలు మొత్తం 9,500 ఎకరాలు ఉండగా, ఇప్పటివరకు 7 వేల ఎకరాల్లో పంట నమోదు చేసుకున్నారు. మొత్తం 8,650 రైతులకు గాను, ఇప్పటివరకు 4,632 వేల మంది రైతులు పంట నమోదు చేసుకున్నారు. వ్యవసాయ సిబ్బంది క్షేత్రస్థాయిలో పంట పొలాల దగ్గరకు వెళ్లి ఈ నమోదు ప్రక్రియను చేపడుతున్నారు. సెప్టెంబరు 30 వరకూ మాత్రమే సమయం ఉండడంతో రైతులందరూ ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

ఖాతాలో నగదు జమ చేస్తున్నారు



ఏ సీజన్‌లో ఏ పంట వేసినా క్రమం తప్పకుండా ఈ-క్రాప్ నమోదు చేయించుకుంటున్నాను. పంట దిగుబడులను ప్రభుత్వమే కొనుగోలు చేసి, మద్దతు ధర కల్పిస్తుంది. దళారీ వ్యవస్థ లేకుండా నేరుగా దిగుబడులను అమ్మడం వల్ల బ్యాంకు ఖాతాల్లో నగదు జమచేస్తున్నారు. సబ్సిడీతో నాణ్యమైన ఎరువులు, విత్తనాలు పొందుతున్నాను.

– నందకుమార్, రైతు, చిన్నవెంకటంపల్లె, ఐరాల

సద్వినియోగం చేసుకోవాలి



ఖరీఫ్ సీజన్‌లో పంటలను సాగు చేస్తున్న రైతులకు ఈ-క్రాప్ తప్పనిసరి. దళారుల చేతుల్లో మోసపోకుండా ప్రభుత్వ మద్దతు ధర పొందాలంటే పంట నమోదు అయి ఉండాలి. ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట నష్టం జరిగితే ప్రభుత్వం తక్షణ పరిహారం అందిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– వరలక్ష్మి, ఏఓ, ఐరాల

నమోదు ఎందుకంటే..

గతంలో ఎన్నడూ లేని విధంగా గత ఖరీఫ్‌కు సంబంధించిన పంటల బీమాను రైతుల ఖాతాల్లో నగదు జమ చేసిన సంగతి తెలిసిందే. ఈ-క్రాప్ నమోదు చేయించుకోవడం ద్వారా ఏదైనా కారణంతో పంట నష్టపోతే ప్రభుత్వం నుంచి వచ్చే పరిహారం దళారులు చేతికి వెళ్లకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాలోకే జమవుతుంది. మండలంలో ఎంత విస్తీర్ణంలో సాగు భూమి ఉంది, ఏ సీజన్‌లో ఏఏ పంటలు ఎంత విస్తీర్ణంలో సాగు చేశారు తదితర వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నారు. పండించిన పంట దిగుబడులను గిట్టుబాటు ధరకు అమ్ముకోవడానికి ఈ-క్రాప్ ఎంతో సహాయపడుతుంది. ఎన్నో ప్రయోజనాలకు మూలమైన ఈ-క్రాప్ నమోదును ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఉంది. వైఎస్సార్ యంత్రసేవ పథకం అమలు, నాణ్యమైన ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు రైతు భరోసా కేంద్రాల ద్వారా లభ్యమవుతున్నాయి.


చిగరపల్లెలో వరి పంటను ఈ-క్రాప్ నమోదు చేస్తున్న ఏఓ వరలక్ష్మి

నివాసాల్లోకి కొండచిలువ


కొండచిలువ

గుడిపాల: మండలంలో ఆరు అడుగుల కొండచిలువ ఇళ్ల మధ్యలోకి వచ్చేసింది. మండలంలోని 189 కొత్తపల్లె ఎస్టీ కాలనీలో 10 కుటుంబాలు ఉన్నాయి. ఎస్టీ కాలనీకి సమీపంలో బుధవారం ఆరు అడుగులున్న కొండచిలువ కనిపించింది. అయితే ఆ పాము మేకపిల్లను తిన్నట్లు స్థానికులు గుర్తించారు. ఎటు కదల్లేకపోవడంతో ఎస్టీ కాలనీ వాసులు పామును చంపివేశారు.

ఇంటి స్థలాలు కేటాయించండి

శ్రీరంగరాజపురం : మండలంలోని మెదవాడ ఎస్టీ గ్రామానికి చెందిన మహిళలు ఇంటి స్థలాలు కేటాయించాలని తహసీల్దార్ లోకనాథపిళ్లైకి బుధవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు ఇంతవరకు ఇంటి స్థలం లేదని, తాము నివాసం ఉంటున్న ఇళ్లు చిత్తూరు-పుత్తూరు జాతీయ రహదారి రోడ్డు నిర్మాణానికి ఇచ్చేశామన్నారు. గతంలో పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం తమ గ్రామంలో నిర్వహించినప్పుడు డిప్యూటీ సీఎం నారాయణస్వామి దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. ఆయన వెంటనే స్పందించి పట్టాలు మంజూరు చేయాలని ఆదేశించారని, ఆ ప్రకారమే తహసీల్దారుకు వినతిపత్రం అందించారన్నారు. దీనిపై తహసీల్దారు స్పందిస్తూ స్థలం పరిశీలించి పట్టాలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారన్నారు.

గణనాథునికి సాంస్కృతిక నీరాజనం


నృత్యం చేస్తున్న కళాకారులు


అశ్వవాహనంపై ఊరేగుతున్న దేవదేవేరులు

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి బ్రహ్మోత్సవాలలో బుధవారం ఆస్థాన మండపంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఉదయం నుంచి కళాకారులు భరతనాట్యం, భక్తి గీతాలు, పౌరాణిక నాటక ప్రదర్శనలు భక్తులను అలరించాయి. మంగళవారం అర్ధరాత్రి తరువాత కల్యాణోత్సవం అనంతరం స్వామివారు దేవదేవేరులతో కలిసి అశ్వవాహనంపై పుర వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు.

వినాయకుని సేవలో జెడ్పీ చైర్మన్ దంపతులు

జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు దంపతులు వరసిద్ధి వినాయక స్వామిని దర్శించుకున్నారు. ఆయన కుటుంబ సమేతంగా స్వామివారి దర్శనార్థం విచ్చేయగా ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేదపండితులచే ఆశీర్వచనం అందించి స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఉభయదారులు చిన్నారెడ్డి పాల్గొన్నారు.


వినాయకుని సేవలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి

గృహసారథులకు బీమాతో ధీమా


సమావేశంలో మాట్లాడుతున్న సుధాకర్‌రెడ్డి

పూతలపట్టు: మండలంలోని సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు బీమా సదుపాయం కల్పించి, అండగా నిలుస్తోందని మండల సచివాలయ కన్వీనర్ సుధాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని పూతలపట్టు1, 2, వడ్డేపల్లి, బైటపల్లి పంచాయతీలోని సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు బుధవారం సమావేశం నిర్వహించారు. ఇందులో ఆయన మాట్లాడుతూ పార్టీ అధిష్టానం గృహసారథులకు రూ.10 లక్షల వరకు బీమా సదుపాయం కల్పిస్తోందని చెప్పారు. ఈ బీమాకు మండలంలోని 51 మంది సచివాలయ కన్వీనర్లు, 448 మంది గృహసారతులు అర్హులని తెలిపారు. అనంతరం సమావేశానికి హాజరైన కన్వీనర్లు, గృహసారథుల వివరాలను సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ద్వారకనాథరెడ్డి, కో-ఆప్షన్ మెంబరు ఖాదర్‌వలీ, సర్పంచులు మాసిలామణి, రామతులసీ, మణి, ప్రవీణ్ నాయకులు నిరంజన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బోధన నైపుణ్యం మెరుగుపడాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ దామోదర్‌నాయుడు

ఐరాల: కాలానికనుగుణంగా ఉపాధ్యాయులు బోధన నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని ఎంఈఓ దామోదర్‌నాయుడు పేర్కొన్నారు. మండలంలోని కాణిపాకం జెడ్పీ హైస్కూల్లో బుధవారం ఐరాల, తవణంపల్లె, పూతలపట్టు మండలాలకు చెందిన హిందీ ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం, ఎం.పైపల్లెలో మండలంలోని ప్రాథమిక పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులకు అన్ని సబ్జెక్టులపై స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ ప్రాథమిక స్థాయి నుంచి విద్యార్థులు చదవడం, రాయడంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. స్కూల్ కాంప్లెక్స్ కార్యక్రమంలో నిర్దేశించిన కృత్యాలను ప్రతి రోజు నిర్వహించాలని చెప్పారు. వృత్తి పరమైన బోధనా నైపుణ్యాలను మెరుగుపరుచుకునేందుకు నిరంతరం కృషి చేయాలని సూచించారు. హిందీ రిసోర్స్ పర్సన్ హషీమ్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు తమ బోధనా నైపుణ్యాలను ఒకరితో ఒకరు పంచుకోవడానికి స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు దోహదపడుతాయని, ఉపాధ్యాయులందరూ విధిగా సమావేశాలకు హాజరై బోధన అనుభవాలను పంచుకోవాలని సూచించారు. సీఆర్సీ హెచ్ఎం అరుణ్‌కుమార్ మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఆర్సీ హెచ్ఎం చంద్రశేఖర్‌నాయుడు, ఆర్పీఎస్‌లు యుగంధర్‌రెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు.

108లో ఒకేరోజు రెండు ప్రసవాలు



మగబిడ్డకు జన్మనిచ్చిన తల్లితో అంబులెన్స్ సిబ్బంది, ఆడబిడ్డకు జన్మనిచ్చిన తల్లితో సిబ్బంది

చిత్తూరు రూరల్: చిత్తూరు పరిధిలోని ఒకే 108 అంబులెన్స్‌లో బుధవారం రెండు ప్రసవాలు జరిగాయి. ఉదయం 8 గంటలకు పెనుమూరు మండలం ముత్తిరేవుల సమీపంలోని విజయనగర్ కాలనీకి చెందిన రాణికి పురిటినొప్పులు అధికమయ్యాయి. కుటుంబీకులు అందించిన సమాచారం మేరకు 10 నిమిషాల్లో అంబులెన్స్ అక్కడికి చేరుకుంది. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించే క్రమంలో చిత్తూరు నగరంలో ఈఎంటీ బద్రి, పైలెట్ రసూల్ ప్రసవం చేయగా, పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. ఇదే అంబులెన్స్‌ను ఉదయం 10 గంటలకు ఐరాల మండలం పాటూరు గుడిపల్లికి చెందిన రేవతికి పురిటినొప్పులు అధికం కావడంతో కుటుంబసభ్యులు 108కు ఫోన్ చేశారు. భరించలేనినొప్పులను గుర్తించిన ఈఎంటీ అనసూయ, పైలెట్ రసూల్ ప్రసవం చేశారు. దీంతో ఆమె చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి సమీపానికి వచ్చినప్పుడు ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఇరు కుటుంబీకులు 108 సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలి

చిత్తూరు కలెక్టరేట్ : విద్యుత్ చార్జీలను తగ్గించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు కోరారు. సీపీఐ, సీపీఎం నాయకులు బుధవారం కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ పేదలకు 200 యూనిట్ల వరకు ఉచితం చేయాలన్నారు. గతంలో విద్యుత్ చార్జీలు పెంచిన చంద్రబాబుకు ప్రజలు తగిన బుద్ధి చెప్పారన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు, సీపీఎం జిల్లా కార్యదర్శి వాడగంగరాజు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి

బంగారుపాళెం: పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలని పలమనేరు డీఎస్పీ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఆయన బుధవారం స్థానిక అప్ గ్రేడ్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. స్టేషన్‌లో పలు రికార్డులను పరిశీలించారు. స్టేషన్‌లో సిబ్బంది వివరాలు, మండలంలో శాంతి భద్రతల పరిస్థితిని గురించి సీఐ నాగరాజరావును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ సమస్యలపై దృష్టి సారించాలన్నారు. గ్రామాల్లో అక్రమ మద్యాన్ని అరికట్టేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సిబ్బంది విధినిర్వాహణలో అలసత్వం వహించరాదన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ రాంభూపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించడమే ధ్యేయం


ముట్టుకూరులో సేవలందిస్తున్న వైద్యులు

తవణంపల్లె: గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ ధ్యేయమని వైద్యాధికారి మోహన్‌వేలు తెలిపారు. బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా ముట్టుకూరులో ఏర్పాటు చేసిన వైద్యశిబిరానికి అనూహ్య స్పందన లభించింది. 85 మంది రోగులకు డాక్టర్ వైద్య పరీక్షలు నిర్వహించారు. రోగులకు బీపీ, సుగర్ పరీక్షలు చేయించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ రష్మిత

197 రామాపురంలో వైద్యశిబిరం

గుడిపాల: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్‌తో ప్రజలకు ఇంటి వద్దే వైద్యం అందుతోందని బొమ్మసముద్రం పీహెచ్‌సీ డాక్టర్ రష్మిత అన్నారు. 197 రామాపురంలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలకు రక్త పరీక్షలు నిర్వహించారు. బీపీ, చక్కెర వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది దివ్య, శిల్ప, శాంతకుమారి, సరస్వతి, అనురాధ, శశికళ పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం


బొమ్మసముద్రంలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న అధ్యాపకులు

గుడిపాల: ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాల ఒప్పంద అధ్యాపకుల సర్వీస్‌ను రెగ్యులర్ చేసే బిల్లును అసెంబ్లీలో ఆమోదముద్ర వేయడంతో బుధవారం బొమ్మసముద్రం జూనియర్ కాలేజీలో పనిచేస్తున్న అధ్యాపకులు సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి పాలాభిషేకం చేశారు. ప్రభుత్వ కాంట్రాక్ట్ లెక్చరర్స్ ఫెడరేషన్ బొమ్మసముద్రం యూనిట్‌కు సంబంధించి అధ్యాపకులు రెడ్డెప్పరెడ్డి, ఓబులేసు, జ్యోతిర్మయి, సెల్వీహేమతోపాటు పలువురు పాలాభిషేకం చేశారు. కళాశాల ప్రిన్సిపల్ శరత్‌చంద్రశేఖర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి గొప్ప నిర్ణయం తీసుకొని అధ్యాపకుల నమ్మకాన్ని నిలబెట్టారన్నారు.

స్వచ్ఛతా హి సేవపై అవగాహన


మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

యాదమరి : స్వచ్ఛతా హి సేవపై విద్యార్థులకు ఎంఈఓ రుక్మిణి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం విద్యార్థులకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ చెత్త రహిత భారత్‌గా మన దేశాన్ని ఉంచడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. గ్రామాల్లో మురికి కాలువలను శుభ్రం చేసుకోవడం, చెత్తను ఎక్కడ పడితే అక్కడ పడేయకుండా చూసుకోవాలని సూచించారు. పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవడం, మంచి నీటిని తీసుకోవడం వంటివాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాలపై గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం విద్యార్థులు మానవహారం నిర్వహించారు. గ్రామీణ నీటి సరఫరా శాఖ ఐఈసీ కన్సల్టెంట్ శాంతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

20 పైసలకే 'సాహో'


కుప్పంలో ఉన్న టమాట నారు


పుంగనూరు : మేలురకం టమాట నారు పంపిణీ చేస్తున్న హెచ్ఓ వరప్రసాద్

- కుప్పంలో టమాట నర్సరీ
- పలు రకాల కూరగాయల నార్లు లభ్యం
- ఉద్యానశాఖాధికారి వరప్రసాద్

గంగవరం/పుంగనూరు: కుప్పంలోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్(సిఓఈ)లో కేవలం 20 పైసలకే సాహో రకం టమాట నారును రైతుల కోసం తమ శాఖ ఆధ్వర్యంలో ఉంచినట్టు ఉద్యానశాఖ అధికారి వరప్రసాద్ బుధవారం తెలిపారు. సుమారు మూడు లక్షల నారు రైతులకు అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. 20 పైసలకే మంచి నాణ్యత గల సాహో నారు రైతులు తీసుకుని సాగు చేస్తే పెట్టుబడి ఖర్చు తగ్గడంతో పాటు పంట ఏపుగా పండి మంచి దిగుబడి వస్తుందని పేర్కొన్నారు. ఇప్పటికే చాలా మంది రైతులు నారు కొనేందుకు ఆసక్తి చూపుతున్నారన్నారు. (సిఓఈ)లో టమాట నారు మాత్రమే కాకుండా వంగ, కాకర, బీర, సొర, అంటుకట్టిన వంగతో పాటు పలు రకాల కూరగాయల నారు సైతం లభిస్తుందన్నారు. పెద్దపంజాణి మండలం రాజుపల్లెకి చెందిన రైతు మంజునాథ్ రెడ్డికి టమాట నారు ఇవ్వడంతో తక్కువ ఖర్చుతో ఆయన పంట సాగు చేశారన్నారు. రైతులు దీనిని సద్వినియోగం చేసుకుని కూరగాయల సాగుతో మంచి ఆదాయం పొందాలని కోరారు.